సాక్షి
కాకినాడ
శనివారం । 9 । నవంబర్ । 2024



కన్నీటి వాగు


ఏలేశ్వరం మండలం తూర్పు లక్ష్మీపురానికి చెందిన నలుగురు అడ్డతీగల మండలం బొంగరాలపాడు వద్ద ఏలేరు కాలువలో గల్లంతయ్యారు. ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. - 8లో ▸



రూ.1,00,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి బాలాజీ ట్రాన్స్‌పోర్టర్స్ అండ్ హ్యాండ్లర్స్ అధినేత బాలసుబ్రహ్మణ్యం (విశాఖపట్నం) శుక్రవారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.

సముద్రంలోకి మిగులు జలాలు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి 60,437 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను శుక్రవారం సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.30 అడుగులుగా నమోదైంది. తూర్పు డెల్టాకు 1,100, సెంట్రల్ వెయ్యి, పశ్చిమ డెల్టాకు 3,500 కలిపి మొత్తం 5,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

స్వల్పంగా తగ్గిన 'ఏలేరు'



ఏలేరు జలాశయం

ఏలేశ్వరం: కొద్ది రోజులుగా వర్షాలు లేకపోవడంతో ఏలేరు జలాశయంలో నీటినిల్వలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. పరీవాహక ప్రాంతం నుంచి జలాశయంలోకి 800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 86.56 మీటర్లు కాగా శుక్రవారం 85.25 మీటర్లుగా నమోదైంది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, 21.47 టీఎంసీల మేర నీటి నిల్వలున్నాయి. ఆయకట్టుకు 600, విశాఖకు 200 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. పంపా రిజర్వాయర్‌కు, తిమ్మరాజు చెరువుకు నీటి విడుదలను నిలిపివేశారు.

జెడ్పీ 'స్థాయీ' సమావేశాలకు 'కోడ్' అడ్డంకి



స్థాయీ సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

కాకినాడ సిటీ: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఎటువంటి తీర్మానాలు, సమీక్షలు చేయకుండానే ముగిశాయి. జెడ్పీ 1 నుంచి 7 వరకూ స్థాయీ సంఘ సమావేశాలను జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించారు. 1, 2, 4, 7 స్థాయీ సంఘాలకు జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, 3వ స్థాయీ సంఘం సమావేశానికి వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, 5వ స్థాయీ సంఘ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యురాలు రొంగల పద్మావతి, 6వ స్థాయీ సంఘ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మేరుగు పద్మలత అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ విప్పర్తి మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈ సమావేశాలను కేవలం పంచాయతీరాజ్ చట్ట పరిధిలో మాత్రమే నిర్వహించామని తెలిపారు. తదుపరి సమావేశంలో అన్ని అంశాలనూ కూలంకషంగా చర్చిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వీవీఎస్ లక్ష్మణరావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్-1, 2 పోలీసు స్టేషన్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా, ఇద్దరికి మూడు రోజుల చొప్పున, ఆరుగురికి రెండు రోజుల చొప్పున జైలు, 14 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సత్యదేవుని దర్శించిన పాట్నా హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ అనుపమ చక్రవర్తి దంపతులకు సత్యదేవుని చిత్రపటం అందజేస్తున్న డీసీ చంద్రశేఖర్

అన్నవరం: పాట్నా (బిహార్) హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.అనుపమ చక్రవర్తి శుక్రవారం కుటుంబ సభ్యులతో కలసి అన్నవరం సత్యదేవుని దర్శించుకున్నారు. రత్నగిరిపై స్వామివారికి పూజలు చేశారు. వారికి పండితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం వేదాశీస్సులు అందజేశారు. స్వామివారి ప్రసాదాలు, చిత్రపటాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ అందజేశారు.

ఉపాధ్యాయుడిపై వేటు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): తూరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు మహ్మద్ తానీషా వలీబాబాపై వేటు పడింది. ఆయనను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వలీబాబాపై ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో అభియోగాలు రుజువు కావడంతో ఆయనను విధుల నుంచి తొలగించామని వివరించారు.

విలీనమా.. విభజనా..!

గ్రామం	జనాభా	ఆదాయం
వాకలపూడి	13,861	3,00,00,000
ఇంద్రపాలెం	22,575	96,00,000
రమణయ్యపేట	28,369	2,80,00,000
చీడిగ	6,365	8,80,000
తూరంగి	25,001	1,34,98,463
వలసపాకల	9,975	79,89,675
మొత్తం	1,06,146	8,99,68,138

- తేలని గ్రామాల 'పంచాయితీ'
- 14 ఏళ్లుగా పరిష్కారం కాని వివాదం
- వెనక్కు పోతున్న ఆర్థిక సంఘం నిధులు
- ఆదాయం ఉన్నా అభివృద్ధిలో తిరోగమనం
- అమ్యామ్యాలతో మోకాలడ్డుతున్న ఉద్యోగులు
- నాడు 'బాబు' పాలనలో వివాదానికి బీజం
- ఇప్పుడైనా పరిష్కరిస్తారా 'బాబూ' అంటున్న జనం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: జిల్లా కేంద్రమైన కాకినాడ నగర పాలక సంస్థలో గ్రామాల విలీన వివాదానికి తెర దించే రోజు వస్తుందా.. గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు నిధులు విడుదలయ్యే మంచి రోజులు చూస్తామా.. అని ప్రజలు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. గ్రామాల విలీన వివాదం మొదలై అప్పుడే 14 ఏళ్లు దాటిపోయింది. ప్రతిపాదిత విలీన గ్రామాల్లో ప్రగతికి ఈ వివాదం ప్రతిబంధకంగా మారింది. గ్రామాల విలీనంపై భిన్నాభిప్రాయాలున్నా విలీనానికే మొగ్గు కనిపిస్తోంది. మధ్యలో రాజకీయాలకు తోడు కొందరు పంచాయతీరాజ్ అధికారులు తమ ఆధిపత్యం కోల్పోకూడదని సాంకేతిక ప్రతిబంధకాలు సృష్టిస్తూ విలీనానికి తెర వెనుక మోకాలడ్డుతున్నారు. ఫలితంగా ఆయా గ్రామాల్లో అభివృద్ధి మందగించి, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పన్నుల భారం పడుతుందనే ఉద్దేశంతో విలీన ప్రతిపాదనను మొదట్లో కొంత మంది వ్యతిరేకించారు. వారు కూడా ఇప్పుడు ఆస్తి విలువ ఆధారంగానే పన్నుల విధానాన్ని కేంద్రం తీసుకు రావడంతో విలీనానికే మొగ్గు చూపుతున్నారు. నగర పాలక సంస్థలో విలీనమైతే ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కళ్లకు కనిపిస్తుందని మేధావి వర్గం అభిప్రాయపడుతోంది. మొత్తంగా చూస్తే విలీన గ్రామ పంచాయతీల్లో సుమారు లక్షన్నర మంది ఈ వివాదానికి ఎప్పుడు ఫుల్ స్టాప్ పడుతుందా అని కళ్లల్లో ఒత్తులు వేసుకుని మరీ ఎదురు చూస్తున్నారు. ఈ వివాదం పుణ్యమా అంటూ గ్రామాల అభివృద్ధికి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు వెనక్కు పోతున్నాయనే ఆవేదన సర్వత్రా నెలకొంది.

ఏయే గ్రామాలంటే..

కాకినాడ నగర పాలక సంస్థకు సమీపాన ఉన్న ఎనిమిది గ్రామాలను విలీనం చేయాలని 2012లో నాటి రూరల్ ఎమ్మెల్యేగా కురసాల కన్నబాబు ప్రతిపాదించారు. తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వలసపాకల, వాకలపూడి, రమణయ్యపేట, స్వామినగర్, ఎస్.అచ్యుతాపురం ప్రాంతాలను నగర పాలక సంస్థలో విలీనం చేసేందుకు ప్రయత్నించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న కన్నబాబు ఈ ప్రతిపాదనను పట్టాలెక్కించేందుకు ప్రయత్నించారు. అయితే, న్యాయస్థానాల్లో కేసులతో ప్రతిష్టంభన ఏర్పడింది. తరువాత చంద్రబాబు ముఖ్యమంత్రిగా 2017లో కార్పొరేషన్‌లో గ్రామాల విలీనానికి పంచాయతీల తీర్మానాలు ద్వారా చేయించారు. దీనికి అనుగుణంగా గవర్నర్ ఆర్డినెన్స్ కూడా జారీ చేశారు. ఈ విషయాన్ని విలీనం కోసం ఆందోళన చేస్తున్న నగర పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు స్పష్టం చేశారు. పంచాయతీలు తీర్మానాలు ఆమోదించగా వాటికి సంబంధించిన రికార్డులు పోలీసు బందోబస్తు మధ్య కార్పొరేషన్‌కు స్వాధీనమయ్యాయి. కొద్ది రోజుల తర్వాత ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులూ లేకుండా అప్పటి జిల్లా కలెక్టర్ నీతూకుమారి గ్రామ పంచాయతీలు కోరిన మేరకు రికార్డులు వెనక్కి ఇచ్చేయడమే కోర్టులో కేసులకు పరోక్ష కారణమైందని అంటున్నారు. అప్పట్లో అధికారంలో ఉన్న నేతల ప్రోద్బలంతో కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఆరు గ్రామాల విలీనం అంశం న్యాయస్థానంలో ఉండగా.. తమ ప్రాంతాలను మాత్రం ఎలా విలీనం చేస్తారంటూ స్వామినగర్, టీచర్స్ కాలనీల ప్రజలు కూడా కోర్టుకు వెళ్లారు. అప్పట్లో అధికారంలో ఉన్న చంద్రబాబు సర్కార్ ఈ ప్రక్రియను చిత్తశుద్ధితో పూర్తి చేయనందువల్లే వివాదానికి బీజం పడిందనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే విలీన ప్రక్రియ నిలిచిపోయి, కార్పొరేషన్ గత కౌన్సిల్ ఎన్నికలు 48 డివిజన్లకు మాత్రమే జరిగాయి. వాస్తవానికి కార్పొరేషన్ ఎన్నికలు 50 డివిజన్లతో నిర్వహించాల్సి ఉంది. కాకినాడ కార్పొరేషన్ పాలక వర్గ పదవీ కాలం ముగియడంతో రెండేళ్లుగా ప్రత్యేకాధికారి పాలన కొనసాగుతోంది.



కాకినాడ ముఖద్వారంగా ఉన్న రమణయ్యపేట గ్రామం

వెనక్కు మళ్లుతున్న రూ.కోట్లు

నగర పాలక సంస్థకు ఎన్నికలు జరగకపోవడంతో రూ.20 కోట్ల ఆర్థిక సంఘం నిధులు రాకుండా పోయాయి. అంతకు ముందు 2010 - 17 మధ్య విలీన ప్రక్రియలో ప్రతిష్టంభన ఏర్పడటంతో ఏడేళ్ల కాలానికి కార్పొరేషన్ రూ.70 కోట్ల మేర ఆర్థిక సంఘం నిధులు నష్టపోయింది. అదే సమయంలో 8 గ్రామాలకు జనాభా ప్రాతిపదికన రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు, స్టాంప్ డ్యూటీ వాటా కలిపి సుమారు రూ.140 కోట్ల మేర నష్టపోయినట్టు అంచనాలున్నాయి. ఈ నిధులు రాకపోవడంతో గ్రామాల్లో సురక్షిత తాగునీరు, మురుగుపారుదల, కల్వర్టులు, రహదారుల నిర్మాణం, వీధి దీపాల నిర్వహణ వంటి కనీస మౌలిక సదుపాయాలకు ప్రజలు దూరమయ్యారు.

అధికారులకు కాసుల వర్షం

విలీన వివాదం గ్రామ పంచాయతీల్లోని పంచాయతీరాజ్ అధికారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల వంటి గ్రామాల్లో భారీ పరిశ్రమలున్నాయి. ఈ పరిశ్రమల ద్వారా దండిగా సొమ్ము వస్తున్న క్రమంలోనే ఈ గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీరాజ్ ఉద్యోగులు విలీన వివాదం పరిష్కారం కాకుండా మోకాలడ్డుతున్నారనే విమర్శలున్నాయి. బదిలీల్లో సైతం వారు విలీన గ్రామాలు దాటి బయటకు వెళ్లకపోవడానికి కూడా ఇదే కారణమని అంటున్నారు.

పరిష్కారమెప్పుడో!

ఇటువంటి పరిస్థితుల్లో పులి మీద పుట్రలా కేంద్రం 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' పేరిట జమిలి ఎన్నికల నిర్వహిస్తామని చెబుతోంది. అదే జరిగితే వచ్చే మూడున్నరేళ్లు నగర పాలక సంస్థకు ఎన్నికలు జరిగే అవకాశం ఉండకపోవచ్చని పరిశీలకులు అంటున్నారు. విలీన వివాదాన్ని పరిష్కరించి, ఎన్నికలు నిర్వహించాలని, ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలనే డిమాండుతో నగర పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు దూసర్లపూడి రమణరాజు ఇటీవల నిరవధిక దీక్ష చేపట్టారు. దీనిపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి స్పందించి ప్రభుత్వానికి నివేదించి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఈ వివాదం ఎప్పటికి పరిష్కారమవుతుందో వేచి చూడాల్సిందే.

ప్రస్తుతం నగరంలో 4.50 లక్షలు, విలీన గ్రామాల్లో 1.50 లక్షల మేర జనాభా ఉంది. ఈ లెక్కల ఆధారంగా 2025-26లో ఆర్థిక సంఘం నిధులు రూ.50 కోట్లు వచ్చే అవకాశం ఉంది. ఇవి రావాలంటే ఎన్నికలు జరగాలి. అది జరగాలంటే విలీన ప్రక్రియ పూర్తి చేయాలి. గ్రామాల విలీనంతోనే డివిజన్ల విభజన చేయాలని మున్సిపల్ చట్టం చెబుతోంది. చంద్రబాబు సర్కార్‌లో విలీన వివాదానికి బీజం పడటంతో ఇప్పుడు అదే ప్రభుత్వం అధికారంలో ఉండటంతో పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల ప్రగతికి విలీన సమస్యే అడ్డంకి



కాకినాడను అనుకుని ఉన్న గ్రామాల అభివృద్ధికి తొలిసారి రూరల్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే నా వంతు ప్రయత్నం చేశాను. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల, ఇంద్రపాలెం, చీడిగ, తూరంగి గ్రామాలు, స్వామి నగర్, ఎస్.అచ్యుతాపురాలను కార్పొరేషన్‌లో విలీనం చేయాలని అప్పట్లోనే ప్రతిపాదించాం. ఈ ప్రక్రియ దాదాపు పూర్తై తూరంగిలో నాలుగు నెలల పాటు కార్పొరేషన్ ఆధీనంలోనే పరిపాలన సాగింది. కొందరు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ ప్రభావం గ్రామాల అభివృద్ధిపై పడుతోంది. అటు కార్పొరేషన్ నిధులు రాక, ఇటు పంచాయతీలకు ఎన్నికలు లేక ఆర్థిక సంఘ నిధులు రాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– కురసాల కన్నబాబు, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ

ప్రక్రియ పూర్తి చేయాలి



గ్రామాల విలీన ప్రక్రియ పూర్తి చేయాలి. చంద్రబాబు హయాంలోనే తలపెట్టిన ఈ ప్రక్రియ అప్పుడే వివాదంతో మూలన పడింది. దీనిని నాడు చిత్తశుద్ధితో పూర్తి చేసి ఉంటే ఈ సమస్య ఇన్నేళ్లు ఉండేది కాదు. తక్షణం న్యాయపరంగా ఎదుర్కొంటున్న ప్రతిబంధకాలను తొలగించాలి. కార్పొరేషన్ ఎన్నికలు జరిపించాలి. విలీన వివాదంతో గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయింది. 2025-26 ఆర్థిక సంఘం నిధులు వచ్చే ఏర్పాటు చేయించాలి.

– దూసర్లపూడి రమణరాజు, పౌర సంక్షేమ సంఘం, కాకినాడ

గ్రామ పంచాయతీలోనే అభివృద్ధి



చాలా చోట్ల మున్సిపాలిటీల కంటే గ్రామ పంచాయతీలే బాగున్నాయి. విలీనం వల్ల అభివృద్ధి జరుగుతుందనుకోవడం సరి కాదు. మంచి పరిపాలన కావాలి. గ్రామ పంచాయతీల్లో కూడా బహుముఖ ప్రగతిలో ఉన్నవి చాలా ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు నిధులు సమకూరిస్తే వాటంతట అవే ప్రగతి సాధిస్తాయి. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. పంచాయతీల్లో ఆదర్శ గ్రామ పంచాయతీలు కూడా ఉన్నాయి.

– నిమ్మకాయల వెంకటేశ్వరరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు, రమణయ్యపేట

విలీనంతోనే ప్రగతి



తూరంగి ప్రాంతాన్ని కార్పొరేషన్‌లో విలీనం చేస్తేనే అభివృద్ధి జరుగుతుంది. గ్రామంలో ఎక్కువగా మురికివాడలు ఉన్నాయి. ఇవి అభివృద్ధి సాధించాలంటే గ్రామాలకు వచ్చే నిధులు ఎంత మాత్రం సరిపోవు. అందునా ప్రణాళికాబద్ధమైన ప్రగతి కావాలంటే కార్పొరేషన్ నిధుల విడుదల ద్వారానే సాధ్యమవుతుంది. విలీనం చేయకుండా ఎన్నికలు నిర్వహిస్తే కోర్టుకు వెళ్తాం.

– దాట్ల వీర వెంకట సత్యనారాయణరాజు, తూరంగి, కాకినాడ రూరల్

ఎన్ఐఆర్ఎఫ్‌లో మెరుగైన ర్యాంక్‌కు కృషి



ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణతో సమావేశమైన ఎన్ఐఆర్ఎఫ్ కమిటీ బృందం

జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్)లో జేఎన్‌టీయూకే తొలి పది స్థానాల్లో ర్యాంకింగ్ సాధించేలా కృషి చేస్తామని యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ తెలిపారు. ఉన్నత విద్యా మండలి నియమించిన నిపుణుల కమిటీ శుక్రవారం వీసీ మురళీకృష్ణతో సమావేశమైంది. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ, ప్రతి విశ్వవిద్యాలయానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేశారని, అందులో భాగంగా జేఎన్‌టీయూకే వర్సిటీకి అన్నా యూనివర్సిటీ ఐక్యూఏసీ డైరెక్టర్ ప్రొఫెసర్ గుణశేఖరన్, వెల్లూరు విట్ డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురుగన్‌తో కమిటీ ఏర్పాటైందన్నారు. యూనివర్సిటీలో రెగ్యులర్ అధ్యాపకులకు పూర్తి స్థాయి రీసెర్చ్ స్కాలర్స్ కేటాయిస్తామని, విదేశీ విద్యార్థుల ప్రవేశాలు మెరుగుపర్చడంతో పాటు, టెక్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్య అభ్యసించేందుకు ప్రోత్సహిస్తామన్నారు. ఫ్యాకల్టీ స్టూడెంట్ రేషియో(ఎఫ్ఎస్ఆర్)ను పెంచేందుకు చర్యలు చేపడతామన్నారు. ఎన్ఎఫ్ఆర్ఐలో ఉత్తమ ర్యాంక్ సాధించేందుకు యూనివర్సిటీ నుంచి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం యూనివర్సిటీలో మౌలిక వసతులు, ఇంజినీరింగ్ విభాగాలు, ప్రయోగశాలలు తదితర వాటిని కమిటీ సభ్యులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. రెక్టార్ కేవీ రమణ, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్ర, డీఏఏ ఏసురత్నం, అడ్మిషన్ల డైరెక్టర్ ప్రసాద్, ఐక్యూఏసీ డైరెక్టర్ కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ మోహనరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించాలి

కాకినాడ సిటీ: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్ర ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) జె వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ ఈ నెల 11న జారీ అవుతుందని, ఆ రోజు నుంచి 18వ తేదీ వరకూ కాకినాడ కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. ఈ నెల 19న నామినేషన్ల పరిశీలన జరుగుతుందని, ఉపసంహరణకు 21వ తేదీ వరకూ గడువు ఉందని వివరించారు. వచ్చే నెల 5న బ్యాలెట్ పేపర్ విధానంలో పోలింగ్, అదే నెల 9న ఓట్ల లెక్కింపు జరుగుతాయని చెప్పారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. రిటర్నింగ్ అధికారిగా జిల్లా కలెక్టర్, ఈఆర్ఓగా తాను వ్యవహరిస్తామన్నారు. ఈ ఎన్నికలకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని 113 మండలాల్లో పురుషులు 9,642 మంది, స్త్రీలు 6,674 కలిపి మొత్తం 16,316 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. మొత్తం 116 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించిన తుది ఓటర్ల జాబితా ప్రచురించామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఓ వెంకటరావు

గ్రాడ్యుయేట్ ఓటు నమోదుకు గడువు పొడిగింపు

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికకు ఓటు నమోదు గడువును వచ్చే నెల 9వ తేదీ వరకూ పొడిగించినట్లు డీఆర్ఓ వెంకట్రావు తెలిపారు. తొలుత ఈ నెల 6 చివరి తేదీగా ప్రకటించారని, అప్పటి వరకూ నమోదు చేసుకున్న వారి పేర్లు ఈ నెల 23న ప్రచురించే డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో ఉంటాయని వివరించారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్‌లో పేరు లేని వారు ఈ నెల 23 నుంచి వచ్చే నెల 9వ తేదీ వరకూ ఓటు నమోదు చేసుకోవచ్చని, వారి పేర్లు డిసెంబర్ 30న ప్రచురించే తుది జాబితాలో ఉంటాయని చెప్పారు. ఈ నెల ఒకటో తేదీకి మూడేళ్ల ముందు డిగ్రీ పూర్తి చేసిన వారు గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో ఇప్పటి వరకూ 2,34,152 మంది ఓటర్లు నమోదయ్యారని తెలిపారు.

ఓటు నమోదుకు అవకాశం

సాధారణ ఓటర్లకు సంబంధించి గత నెల 29 నాటికి జిల్లాలో 16,35,300 మంది ఓటర్లుగా నమోదయ్యారని, వీరిలో 8,04,834 మంది పురుషులు, 8,30,002 మంది మహిళలు, 190 మంది ఇతరులు ఉన్నారని డీఆర్ఓ వెంకట్రావు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు వీలుగా ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ఆ తేదీల్లో ఆయా పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవెల్ అధికారులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అందుబాటులో ఉంటారన్నారు. వచ్చే నెల 24న అభ్యంతరాలను పరిశీలించి, జనవరి 6న ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తామని చెప్పారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ



సత్యదేవుని దర్శనానికి ఆలయం వద్ద క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి శుక్రవారం కిటకిటలాడింది. సత్యదేవుని ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, విశ్రాంతి మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. దీంతో స్వామివారి వ్రత మండపాలతో పాటు నిత్య కల్యాణ మండపంలో సైతం వ్రతాలు నిర్వహించారు. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, రూ.200 టికెట్టు దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామివారిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. తూర్పు రాజగోపురం ముందు రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారి వ్రతాలు 2,100 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. నిత్యాన్నదాన పథకం వద్ద భక్తులకు పులిహోర, దద్దోజనం పంపిణీ చేశారు. శనివారం నుంచి బుధవారం వరకూ పర్వదినాలు కావడంతో ఆలయానికి భక్తులు భారీగా తరలి వస్తారనే అంచనాతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెల్లవారుజామున ఒంటి గంట నుంచి సత్యదేవుని వ్రతాలు, దర్శనాలకు భక్తులను అనుమతించేందుకు ఏర్పాట్లు చేశారు. శనివారం సుమారు 60 వేల మందికి పైగా భక్తులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు. వ్రతాలు 4 వేలకు పైగా జరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

సత్యదేవుని తెప్పోత్సవానికి ఏర్పాట్లు



పంపా నదిలో పంటు ట్రయల్ రన్

అన్నవరం: కార్తిక శుద్ధ ద్వాదశి సందర్భంగా పంపా జలాశయంలో ఈ నెల 13వ తేదీ రాత్రి నిర్వహించే సత్యదేవుని తెప్పోత్సవానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. హంస వాహనంపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీ అమ్మవారు పంపా జలాశయంలో మూడుసార్లు విహరించనున్నారు. తెప్పోత్సవంలో ఉపయోగించే పంటుకు ధవళేశ్వరం నుంచి వచ్చిన జలవనరుల శాఖ సిబ్బంది మరమ్మతులు పూర్తి చేసి నదిలోకి దింపిన విషయం తెలిసిందే. కాగా కాకినాడ పోర్టు నుంచి వచ్చిన సిబ్బంది ఈ పంటుకు ఇంజిన్ బిగించి, పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. పంపాలో పంటు ట్రయల్ రన్ శుక్రవారం నిర్వహించారు. ఇది విజయవంతం కావడంతో దేవస్థానం అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. దేవస్థానం ఈఈ రామకృష్ణ, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో మరోసారి ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. కాగా ఈ పంటును శనివారం నుంచి హంస వాహనంగా అలంకరించనున్నారు. ముందు భాగంలో హంస తలభాగం, మధ్యలో ఇరువైపులా రెక్కలు, చివరన తోక అమర్చి, వాటిని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. దీనికి నాలుగు రోజులు పడుతుందని అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

విద్యార్థులను నిపుణులుగా చేయడమే లక్ష్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న చైతన్యరాజు

రాజానగరం: నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు విద్యార్థులకు అందిస్తూ, వారిని ప్రపంచంలో తిరుగులేని నిపుణులుగా తయారు చేయడమే తమ ప్రధాన లక్ష్యమని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అన్నారు. జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, చాట్ జీపీటీలతో కలసి అనువర్తనాలపై జీజీయూ శుక్రవారం జాతీయ స్థాయి కార్యక్రమం నిర్వహించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావాన్ని ప్రొ. చాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ వివరించారు. సాంకేతిక పరిజ్ఞాన్ని పెంపొందించుకోవడంలో ఏఐ టూల్స్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. సాంకేతిక విద్యలో ఏఐ విప్లవాత్మక మార్పులను బెంగళూరుకు చెందిన కరిష్మా కార్పొరేషన్ చైర్మన్, సీఈఓ, ఇండో – అమెరికన్ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ రాజ్ మృత్యుంజయప్ప వివరించారు. ఆటో మొబైల్ రంగంలో ఏఐ అన్వయాలు, వినియోగాల గురించి కాంటినెంటల్ ఇండియా ప్రెసిడెంట్, సీఈఓ ప్రశాంత్ దొరస్వామి తెలియజేశారు. జీజీయూ వీసీ యు.చంద్రశేఖర్ ఆధ్వర్యాన ప్యానల్ డిస్కషన్ నిర్వహించారు. ఏఎంఎస్ ఇండియా సీఈఓ ఎన్‌సీ శశిధర్ కూడా ప్రసంగించారు. కార్యక్రమానికి బి.సుజాత, ఆర్.తమశకోడి, కె.వల్లీ మాధవి కన్వీనర్లుగా వ్యవహరించారు.

పోలవరం కాలవలో పడి వివాహిత ఆత్మహత్య


మృతురాలు నక్కా ఏసమ్మ (ఫైల్)

జగ్గంపేట: భర్త సినిమాకి తీసుకువెళ్లలేదని అలిగి రెండు రోజులు క్రితం అదృశ్యమైన వివాహిత జగ్గంపేటలోని పోలవరం కాలవలో శవమైతేలింది. సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం జగ్గంపేట సత్యవేణి పేటకు చెందిన వెలుగుల వీర దుర్గాప్రసాద్ భార్య ఏసమ్మ (22) రెండు రోజుల క్రితం నుంచి కనిపించటలేదని తెలిపారు. అయితే ప్రతి చిన్న విషయానికి కోపగించే ఏసమ్మ ఈ నెల 6వ తేదీన భర్తను సినిమాకి తీసుకుని వెళ్లమని కోరడం, టైం అయిపోవడంతో తరువాత వెళదామని భర్త చెప్పడంతో ఆమె కోపగించి ఎటో వెళ్లిపోయిందని తెలిపారు. అయితే ఆమె కోపగించి రెండురోజుల పాటు బంధువుల ఇళ్లకు వెళ్లడం తిరిగి రావడం సర్వసాధారణమేనని భావించి భర్త, ఆమె పుట్టింటి వారు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. అయితే శుక్రవారం ఉదయం జగ్గంపేట డిగ్రీ కాలేజీ సమీపంలో పోలవరం కాలవలో ఒక మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆ మహిళ మృతదేహం ఏసమ్మదిగా ఆమె తల్లి, భర్త గుర్తించారు. ఏసమ్మకు 2021లో జె.తిమ్మాపురం గ్రామానికి చెందిన వీరబాబుతో వివాహమై ఏడాది కాకుండానే విడాకులు తీసుకున్నారు. తరువాత జగ్గంపేటకు చెందిన దుర్గాప్రసాద్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. మృతురాలి తల్లి నక్కా వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఎస్సై రఘునాథరావు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాసరావు వివరించారు.

కన్నీటి వాగు

- ఏలేరు కాలువలో నలుగురు గల్లంతు
- ఇసుక తవ్వకాలకు వెళ్లి మునక
- ఇద్దరి మృతదేహాలు లభ్యం
- మిగిలినవారి కోసం గాలిస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు
- తూర్పు లక్ష్మీపురంలో విషాదఛాయలు


మిగిలినవారి కోసం గాలిస్తున్న ఎస్‌డీఆర్ ఎఫ్ బృందాలు


ఘటన స్థలంలో రోదిస్తున్న మృతుల బంధువులు

ఏలేశ్వరం: రోజూ తవ్వుకునే ఇసుకే తమను మింగేస్తుందని ఆ నలుగురికీ తెలియలేదు. ఎప్పుడూ తవ్వే చోటే మరింత ఇసుక తవ్వుకుని నాలుగు డబ్బులు సంపాదిద్దామనుకున్న వారి ఆశ పాశమై కిందకు లాగేసింది. ఇంకాస్త లోతుకు వెళ్లాలని వారు తీసుకువెళ్లిన ఓ స్టాండ్ వారిని నిలువనీయకుండా పైకి రానీయకుండా అడ్డుపడి ప్రాణాలకు ప్రమాదమై అడ్డుపడింది.

అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం బొంగరాలపాడు వద్ద ఏలేరు కాలువలో ఇసుక తవ్వకానికి వెళ్లిన ఐదుగురిలో ఇద్దరు మృతి చెందగా ఇద్దరు గల్లంతయ్యారు. ఒకరు ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం గ్రామానికి చెందిన వీరమల్లు భూషణం (52), వీరమల్లు జయబాబు(25), చింతా శ్రీనివాస్ (16), చిన గొంతియ్య (30) బొంగరాలపాడు వద్ద ఇసుక తీసుకువచ్చేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ మునిగిపోయారు. భూషణం ఇటీవల ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. దళిత కుటుంబానికి చెందిన అతడు ఇసుక క్రయవిక్రయాలు చేస్తుంటాడు. రోజులాగే తన కుమారుడు జయబాబు, వరసకు అల్లుడయ్యే చిన గొంతియ్య, చింతా శ్రీనివాస్, మరో వ్యక్తి శామ్యూల్‌తో కలిసి ఇసుక తెచ్చేందుకు అతడి ట్రాక్టర్‌తో బొంగరాలపాడు వెళ్లారు. అక్కడ నడుము లోతు గోతిలో ఒక స్టాండ్ సాయంతో మరింత ఇసుక తవ్వేందుకు ప్రయత్నిస్తుండగా భూషణం మునిగిపోయాడు. అతన్ని రక్షించేందుకు పక్కనే ఉన్న జయబాబు, వారిని రక్షించేందుకు గొంతియ్య, చింతా శ్రీను ప్రయత్నించారు. మొత్తం నలుగురు మునిగిపోయి గల్లంతయ్యారు. దీంతో శామ్యూల్ ఆందోళనతో ఒడ్డుకు వచ్చేశాడు. ఈ ఘటనను గమనించిన పక్కనే చేపలు పడుతున్న మత్స్యకారులు వెంటనే గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. డీఎస్పీ జి.సాయి ప్రశాంత్, సీఐ నరసింహమూర్తి, తహసీల్దార్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చేపట్టాయి. వీరమాల జయబాబు, చిన గొంతియ్య మృతదేహాలు దొరకడంతో వాటిని పోస్టుమార్టం నిమిత్తం నిమిత్తం అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మిగతా ఇద్దరి ఆచూకీ కోసం 31 మందితో కూడిన ఎస్డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని రోదిస్తున్నారు.


వీరమల్లు భూషణం మృతదేహం

భర్తను, బిడ్డను కోల్పోయి..

భర్త భూషణం, కుమారుడు జయబాబును కోల్పోయిన వీరమల్లు లక్ష్మి రోదన వర్ణనాతీతం. ఇంటి పెద్దతో పాటు, అంది వచ్చిన కొడుకు గల్లంతయ్యారన్న వార్తతో ఆ కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఇంటికి పెద్ద కుమారుడు

చింతా గోపి, సత్యవతిలకు ముగ్గురు సంతానం కాగా శ్రీనివాస్ పెద్దవాడు. కుటుంబానికి పెద్దవాడవడంతో కూలీ పనులు చేస్తూ ఆసరాగా నిలుస్తున్నాడు. అతడు గల్లంతవడంతో ఆ కుటుంబం తీవ్ర ఆందోళనకు గురవుతోంది.

బంధువుల ఇంటికి వచ్చి..

కూలీ పనుల నిమిత్తం బంధువుల ఇంటికి వచ్చి తూర్పు లక్ష్మీపురంలో ఉంటున్నాడు చినగొంతియ్య. భూషణానికి బంధువు కావడంతో ఇక్కడకు వచ్చి కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. పని కోసం వచ్చి గల్లంతవడంతో అతని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

కొనసాగిన సిమ్యులకాన్

డాక్టర్ గన్నికి జీవన సాఫల్య పురస్కారం



జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం: వైద్య విద్య బోధనకు, ఆస్పత్రులలో చికిత్సలకు మధ్య అంతరాన్ని తగ్గించడంలో సిమ్యులేషన్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో హెల్త్ కేర్ సిమ్యులేసన్ సొసైటీ (ఎస్‌హెచ్ఎస్) ఆధ్వర్యంలో 6వ వార్షిక హెల్త్‌కేర్ సిమ్యులేషన్ కాన్ఫరెన్స్, సిములకాన్ 2024 శుక్రవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా జీఎస్ఎల్ వైద్య కళాశాల వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావుకు సొసైటీ ప్యాట్రన్, జీవిత సాఫల్య పురస్కారాలను అందించారు. సిమ్యులేషన్‌లో విశిష్ట సేవలు అందించిన డాక్టర్ దినకర్‌పాయ్‌ను నిర్వాహకులు సత్కరించారు.

భర్త కోసం మహిళ మౌన పోరాటం

- మరొకరితో సహజీవనం చేస్తున్నాడని ఆరోపణ
- అధికారులు స్పందించి న్యాయం చేయాలని వినతి


మౌన పోరాటం చేస్తున్న బాధితురాలు

పిఠాపురం: తన భర్త తనకు కావాలంటూ ఇద్దరు చిన్న పిల్లలతో కలిసి భర్త ఇంటి ఎదుట ఓ మహిళ శుక్రవారం పట్టణంలో మౌన పోరాటానికి దిగింది. మహిళ తల్లిదండ్రులు పెంకె త్రిమూర్తులు, సరస్వతి తెలిపిన వివరాల మేరకు తమ కుమార్తె సౌమ్య లక్ష్మికి 2017 మార్చి ఐదో తేదీన రాజమహేంద్రవరం లలితా నగర్‌కు చెందిన విత్తనాల రామలక్ష్మణ్ కుమార్‌తో అన్నవరంలో వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, పెళ్లయిన నాటి నుండి భర్త, అత్తింటి వారు తీవ్ర వేధింపులకు గురి చేస్తూ వచ్చారని తెలిపారు. వరకట్న వేధింపులపై స్థానిక అంగర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి కేసు పెట్టామని తెలిపారు. అయినప్పటికీ పిల్లలకు, తనకు అన్యాయం చేయవద్దని కలిసి ఉందామని తమ కుమార్తె ఎంత వేడుకున్నా తమ అల్లుడు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా వేరే మహిళతో సహజీవనం చేస్తున్నాడని పేర్కొన్నారు. తమ కుమార్తె మనవరాళ్లు, అల్లుడు కలిసి జీవించాలని తాము కోరుకుంటున్నామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను వేడుకుంటున్నామని అన్నారు. కాగా మౌన పోరాటం చేస్తున్న మహిళకు కాకినాడ టీడీపీ మహిళా అధ్యక్షురాలు సత్యభామ, జనసేన వీర మహిళ వెంకటలక్ష్మి, ఐద్వా పిఠాపురం పట్టణ అధ్యక్షురాలు కుంచే మణి తదితరులు సంఘీభావం తెలిపారు.

పలు చోరీ కేసులలో వ్యక్తి అరెస్టు

- రూ.5లక్షల విలువైన బంగారు, వెండి వస్తువుల స్వాధీనం


తూరంగిలో చోరీకి సంబంధించి స్వాధీనం చేసుకున్న సొత్తును చూపిస్తున్న సీఐ చైతన్య కృష్ణ, ఎస్సై వీరబాబు తదితరులు

కాకినాడ రూరల్: తూరంగి గ్రామంలో తాళం వేసిన ఇల్లు కనిపిస్తే చోరీకి పాల్పడే పాత నేరస్తుడు బత్తిన లక్ష్మణరావును ఇంద్రపాలెం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కాకినాడ జగన్నాథపురం కోమలవారి వీధికి చెందిన అతడి అరెస్టుపై ఇంద్రపాలెం పోలీసు స్టేషన్‌లో సీఐ చైతన్యకృష్ణ, ఎస్సై ఎం.వీరబాబు శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. తూరంగి గ్రామంలో ఏప్రిల్ నెలలో ఒక ఇంట్లో, గత నెలాఖరున మరో ఇంట్లో జరిగిన చోరీలపై పోలీసు కేసు నమోదైంది. దర్యాప్తు అనంతరం పాత నేరస్తుడు లక్ష్మణరావును తూరంగి బాలయోగి సెంటరు వద్ద గురువారం మధ్యాహ్నం అరెస్టు చేసి అతడి నుంచి చోరీ సొత్తు రూ.5 లక్షల విలువైన 59 గ్రాముల బంగారు, 1189 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మణరావుపై అనకాపల్లి టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో 7, సబ్బవరం, కోటనందూరు పోలీసు స్టేషన్ల పరిధిలో ఒక్కొక్కటి కలిపి 9 కేసులు నమోదైనట్టు సీఐ చైతన్య కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇళ్లు వదిలి బయటకు వెళ్లే సమయంలో తాళం కప్పలు బయటకు కనపడకుండా జాగ్రత్త పడాలని, ఊరికి దూరంగా జనావాసాలు లేని ప్రాంతాల్లోని ఇళ్ల వారు సీసీ కెమెరాలు తప్పక ఏర్పాటు చేసుకోవాలన్నారు. మోటారు సైకిల్‌కు హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్ లాక్ వేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్సై ప్రసాద్, క్రైమ్ హెచ్‌సీ ప్రసాద్, క్రైమ్ పీసీ అప్పారావు పాల్గొన్నారు.

తెలుగు వైభవాన్ని పునరుద్ధరించుకుందాం

- మంత్రి కందుల దుర్గేష్
- 'నన్నయ'లో ముగిసిన 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం' సదస్సు


పుస్తకావిష్కరణ చేస్తున్న మంత్రి దుర్గేష్

రాజానగరం: చారిత్రక ప్రసిద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవాన్ని పునరుద్ధరించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ, కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్, ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతిక సమితి, విజయవాడలోని సెంటర్ ఫర్ ఏపీ స్టడీస్ (కాప్స్) సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం' సదస్సు శుక్రవారం ముగిసింది. సభలో మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ, టంగుటూరి ప్రకాశం పంతులు, కందుకూరి వీరేశలింగం వంటి ఎందరో మహనీయులు నడియాడిన ఈ నేలపై సాంస్కృతిక వైభవాన్ని పెంపొందించే దిశగా ఇటువంటి సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రాచీనమైన తెలుగుభాషకు సంబంధించి లిఖితపూర్వక ఆధారాలను భద్రపర్చుకోవలసిన అవసరం ఉందన్నారు. తెలుగు వారికి మాత్రమే ఉన్న గొప్ప సాహిత్య రూపం – పద్య, పౌరాణిక నాటకాలన్నారు. రాష్ట్రంలోని ఎన్నో కళారూపాలను ఆదరించాలని సూచించారు. ఈ సందర్భంగా 'వేదంలా ఘోషించే గోదావరి...' పాటకు కూచిపూడి నృత్య రీతిలో ప్రదర్శించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ 'ఆదికవి నన్నయ' పేరుతో ఏర్పడిన యూనివర్సిటీలో విద్యార్థుల ఉన్నతిని ఆకాంక్షిస్తూ క్రమశిక్షణతో కూడిన బోధనను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని ఈ వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇదే కార్యక్రమంలో కాప్స్ ద్వారా రూపొందించిన 'ఆంధ్రప్రదేశ్ దిగ్దర్శనం', ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య శ్రీనివాసరావు రూపొందించిన 'జియాలాజికల్ మ్యాప్', ఆంధ్ర శక్తి ద్వారా రూపొందించిన 'ఈట్ టు ఫీడ్' పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, క్రాఫ్ట్ చైర్మన్, ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కర్రి రామారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ

- ఇల్లు అద్దె కోసమని వచ్చి దురాగతం
- దర్యాప్తు చేస్తున్న పట్టణ పోలీసులు


వృద్ధురాలు అన్నపూర్ణ నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ వీర గంగాధర తిలక్, ఎస్సై శోభన్‌కుమార్

నిడదవోలు : ఇల్లు అద్దెకు కావాలని వచ్చిన ఇద్దరు యువకులు వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు తెంచుకుని ఉడాయించిన సంఘటన స్థానిక గాంధీనగర్ ఒకటో వీధిలో శనివారం చోటుచేసుకుంది. గాంధీనగర్ ఒకటో వీధిలో నూలి రామారావు, అన్నపూర్ణ వృద్ధ దంపతులు నివాసమంటున్నారు. నాలుగు రోజుల క్రితం ఓ యువకుడు ఇంటికి వచ్చాడు. అమలాపురంలో కొబ్బరి వ్యాపారం చేస్తున్నానని, కర్ణాటకలో మా బావగారు బ్యాంకులో పనిచేస్తున్నారని, నిడదవోలు బ్యాంకుకు వస్తున్నారని, ఇల్లు అద్దెకు కావాలని అన్నపూర్ణకు చెప్పాడు. ఆమె సరేనని చెప్పడంతో అతడు మళ్లీ వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంటకు అతడు వచ్చి ఇల్లు అడగడంతో మరొకరికి ఇచ్చేశామని ఆమె బదులిచ్చింది. అయినా వినకుండా ఇల్లు చూస్తానని చెప్పడంతో ఆ బిల్డింగ్‌లో రెండో పోర్షన్ తాళాలను అతడికి ఇచ్చి అతడితో పాటు వెళ్లింది. వృద్ధురాలిని మాటల్లో పడేసి ఒక్కసారిగా ఆమె మెడలో ఉన్న ఏడు కాసుల బంగారు గొలుసులు తెంచుకుని అప్పటికే రోడ్డుపై బైక్ స్టార్ట్ చేసి సిద్ధంగా ఉన్న మరో యువకుడుతో ఉడాయించాడు. సీఐ వీర బాలగంగాధర్ తిలక్, పట్టణ ఎస్సై పి.శోభన్‌కుమార్ తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఉద్యోగాల కోసం 'వేదాంత' వద్ద నిరసన


ప్లాంటు అధికారులకు వినతి పత్రం అందిస్తున్న ఎస్.యానం గ్రామస్థులు

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామంలో ఉన్న వేదాంత ప్లాంటు గేటు ఎదుట ఉద్యోగాల కల్పన కోరుతూ గ్రామస్తులు బైఠాయించి ఆందోళన చేపట్టారు. గతంలో టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగంలో 75 మంది స్థానిక యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రజాప్రతినిధులు, ప్లాంటు అధికారులు, జిల్లా కలెక్టర్ సమక్షంలో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రోజులు గడుస్తున్నా ప్లాంటు అధికారుల నుంచి స్పందన రాకపోవటం, అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ఓఎన్‌జీసీ అధికారులు వారిని విస్మరించడంతో శుక్రవారం ప్లాంటు అధికారులకు వినతి పత్రం అందించేందుకు గ్రామస్తులు సంస్థ గేటు వద్దకు వెళ్లారు. అధికారుల స్పందించకపోవడంతో వారు అక్కడే బైఠాయించి ప్లాంటు కార్యకలాపాలను అడ్డుకున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో సైతం సిబ్బందిని బయటకు రానివ్వకపోవటం, బయట నుంచి ప్లాంటు సిబ్బందికి భోజనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో అధికారులు దిగి వచ్చి ఆందోళనకారులతో చర్చించారు. ప్లాంటు ఐఎం మైల్‌వేగన్, ఏవో సోమన్‌దేవ్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేసి పది రోజుల్లో ఉద్యోగాలు కల్పించాలని కోరారు. గ్రామ సర్పంచ్ జోగి రాజరాజేశ్వరి, పెట్టా అప్పారావు, లంకే భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆదాయం పెంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీ నాగ నరసింహారావు

సామర్లకోట: మున్సిపాలిటీల ఆదాయంపై అధికారులు దృష్టి సారించాలని మున్సిపల్ ఆర్డీ నాగ నరసింహారావు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో తుని, పిఠాపురం, గొల్లప్రోలు, ఏలేశ్వరం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీ, నగర పంచాయతీ అధికారులతో ఆయన సమీక్షించారు. ఇంటి, కుళాయి పన్నుల బకాయిలపై కనీసం నోటీసులు కూడా ఇవ్వకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపాలిటీల వారీగా సమీక్షిస్తూ ఏలేశ్వర నగర పంచాయతీలో ఆర్ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, శానిటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కమిషనర్ ఎం.సత్యనారాయణ తెలిపారు. సచివాలయ సిబ్బంది ఉపయోగించి బకాయిలు వసూలు చేయాలని ఆర్డీ ఆదేశించారు. నోటీసులు ఇచ్చినా స్పందించని వ్యాపార సంస్థల కుళాయి కనెక్షన్లు తొలగించాని ఆదేశించారు. ప్రభుత్వ సంస్థలు మినహా మిగిలిన మొండి బకాయిల వసూలుపై శ్రద్ధ చూపాలని సూచించారు. అలాగే పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలని, అక్రమ కట్టడాలపై దృష్టిపెట్టాలని, ప్రకటన బోర్డులను గుర్తించి వాటిపై ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, గొల్లప్రోలు, ఏలేశ్వరం కమిషనర్లు వెంకటేశ్వరరావు, కనకారావు, కేవీ పద్మావతి, ఎ.శ్రీవిద్య, రవి కుమార్, ఎం సత్యనారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన తక్షణం చేపట్టాలి

ఎమ్మెల్సీ కుడుపూడి డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కుడుపూడి, బీసీ సంఘాల నాయకులు

అమలాపురం టౌన్: రాష్ట్రంలో సమగ్ర బీసీ కుల గణన సర్వే తక్షణమే చేపట్టాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావుతో పాటు పలు బీసీ సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీ కుల గణనకు ఆమోద ముద్ర వేసినప్పటికీ నేటికీ వెనుకబడడంపై బీసీ సంఘాల నేతలు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక శెట్టిబలిజ గ్రంథాలయం వద్ద ఎమ్మెల్సీ కుడుపూడి అధ్యక్షతన శుక్రవారం జరిగిన బీసీ సంఘాల నేతల సమావేశం వచ్చే జనవరి లోపు బీసీ కుల గణన జరిగి తీరాలని, లేని పక్షంలో బీసీలంతా ఉద్యమం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్సీ కుడుపూడి హెచ్చరించారు. బీసీలకు రాజ్యాంగ రక్షణ కావాలని, వారి డిమాండ్ నెరవేరాలంటే సర్వే చేపట్టాలని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పలు బీసీ సంఘాల నాయకులు దండుమేను రూపేష్, భరణికాన బాబు, తాళాబత్తుల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రగతి'లో జాతీయ స్థాయి సదస్సు

స్త్రైడ్స్ 2025 పోస్టర్ ఆవిష్కరణ


స్త్రైడ్స్ 2025 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్, తదితరులు

గండేపల్లి: సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్టు చైర్మన్ పి.కృష్ణారావు తెలిపారు. స్త్రైడ్స్–2025 పేరిట మూడు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమం జనవరి 8, 9, 10 తేదీలలో జరుగుతుందన్నారు. సివిల్ విభాగానికి చెందిన ఎలెవేర్ 2024, ఇఇఇ విభాగానికి చెందిన ఎక్స్–2024, మెకానికల్ విభాగానికి చెందిన ఎరుడైట్–2024, ఈసీఈ విభాగంలో ఇజైవ్–2024, సీఎస్ఈ విభాగం ఎప్రోజెన్–2024, సీఎస్ఎంలో ఇ–ఆర్టిఫ్యాక్ట్–2024, సీఎస్‌డీలో ఇ–డాటమ్ 2024, సీఏఐలో ఇ–బిగ్నా– 2024, ఐటి ఎమిట్రిక్స్–2024 పేరిట కార్యక్రమాలు జరుగుతాయన్నారు. విద్యార్థుల్లో సాంకేతిక సరిహద్దులను అన్వేషించడమే స్త్రైడ్స్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా స్త్రైడ్స్–2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు.

పోక్సో కేసులో నిందితుడి అరెస్టు

విద్యార్థినిని తల్లిదండ్రులకు అప్పగించిన అధికారులు

ప్రత్తిపాడు: మండలం రాచపల్లి గ్రామానికి చెందిన యువకుడిని పోలీసులు శుక్రవారం పోక్సో కేసులో అరెస్టు చేశారు. నిందితుడు తన వెంట తీసుకుపోయిన బాలికను ఆమె తల్లిదండ్రులను అప్పగించారు. ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావు తెలిపిన వివరాల మేరకు రాచపల్లి గ్రామానికి చెందిన బాలిక ఇదే మండలంలోని ఒమ్మంగిలో ఒక ప్రైవేటు పాఠశాలకు నిత్యం ఒక ఆటోలో వెళ్లి వస్తూ చదువుకుంటోంది. ఈ నెల 30న పాఠశాలకు వెళ్లిన ఆమె అదృశ్యమైంది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి ఆటో డ్రైవర్ పెదిరెడ్డి కృపారాజుపై అనుమానించి దర్యాప్తు చేశారు. కృపారాజు తన కూతురు, కొడుకుతో పాటు సదరు విద్యార్థినిని ప్రేమిస్తున్నా.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తీసుకుపోయాడు. అనంతరం ఆమెను ధర్మవరం, కాకినాడ, రాజమహేంద్రవరం, భీమవరం తదితర గ్రామాల్లో తిప్పుడూ లైంగిక అవసరాలు తీర్చుకున్నాడు. అనంతరం శుక్రవారం ఆమె రాచపల్లి తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. అనంతరం ఆమెను స్థానిక తహసీల్దార్ ఎం.సూర్యప్రభ వద్ద హాజరుపరిచి, తల్లిదండ్రులను అప్పగించారు. ధర్మవరం గ్రామ శివారులో నిందితుడు ఆటోడ్రైవర్ పెద్దిరెడ్డి కృపారాజును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.